క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: ఈ నెల 25, 26 తేదీల్లో సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహిస్తున్న పీవైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీవైఎల్ నేతలు నరేశ్, శ్రీను పిలుపునిచ్చారు. మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ బద్రుతండాలో శిక్షణ తరగతుల ప్రచార కరప్రతాలను సోమవారం వారు ఆవిష్కరించి, మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పాషా, నరేశ్, బిచ్చు, వీరు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి..

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం గ్రామ పంచాయతీ కేటీపీఎస్ కర్మాగారం సమీపంలో ఉండటంతో ప్రజలు వాయి కాలుష్యానికి గురవుతున్నారని, దీంతో అనేక రకాల వ్యాధులబారిన పడుతున్నారని, గ్రామానికి సీఎస్ఆర్ పాలసీ కింద నిధులతో పాటు వైద్యశిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి రమేశ్, ఎర్రగడ్డ ప్రభాకర్, ఎం.వెంకటేశ్, వి.రాకేశ్, ఎం.అబీ, పి.నరేశ్, రాజు, పి.రాంబాబు, సత్యం, ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షించండి

ఇల్లెందు: పట్టణంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజల ప్రాణాలు కాపాడాలని టీడీపీ నేత ముద్రగడ వంశీ కోరారు. సోమవారం ఇల్లెందులో టీడీపీ నేతలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం పేరుకుపోయిందని తెలిపారు. రాత్రుల్లో లైట్లు లేక ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. స్పందించిన కమిషనర్ శ్రీకాంత్ కోతులు, కుక్కల పట్టుకునేవారి కోసం వాకబు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలుమాల బాలకృష్ణ, చాందావత్ రమేశ్‌బాబు, బాలరాజ్, నర్సయ్య, బాబు, రవి, రాజేశ్, శ్యామ్, రత్నాకర్, నవీన్, రాజు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓకు వినతి

టేకులపల్లి: కోయగూడెం ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకుల బృందంతో కలిసి ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట యాత్రలో భాగంగా కోయగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించినప్పుడు అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని, అధికారులు ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. గిరిజన శాఖ నిబంధనల ప్రకారం ఎస్జీటీ, క్రాఫ్ట్, పీఈటీలకు మాత్రమే వార్డెన్ల బాధ్యతలు అప్పగించాలని కానీ, ఎక్కడ కూడా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు వార్డెన్ బాధ్యతలు ఇవ్వలేదని పేర్కొన్నారు. పీఓను కలిసినవారిలో మునిగెల శివ, బానోత్ నరేందర్, మోహన్ ఉన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న కమిషనర్

పాల్వంచరూరల్: శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారిని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

వైద్యశిబిరం

సుజాతనగర్: వేపలగడ్డ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సబ్ సెంటర్‌లో టీబీ ముక్తి భారత్ అభియాన్ పథకం కింద సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 39 మందికి ఎక్స్‌రే తీసి 9 మంది అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ నెల 30 వరకు ఎక్స్‌రేలు తీస్తామని వైద్యాధికారి రమేశ్ తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ రఫేల్, నోడల్ పర్సన్ జానకీరాం, సాయికృష్ణ పాల్గొన్నారు.

కోత విధించడం తగదు..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు రేయింబవళ్లు కష్టపడి సంపాదించిన దాంట్లో 50 శాతం కోత విధించడం సరికాదని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, తుమ్మా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగొద్దు..

ఇల్లెందు: శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఎస్.చంద్రభాను కోరారు. సోమవారం శరన్నవరాత్రి వేడుకల భక్త మండళ్లతో పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మత విద్వేశాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజున రాత్రి 9 గంటలకే జమ్మి గ్రౌండ్‌కు విగ్రహాలు చేరుకోవాలని సూచించారు. డీజే సౌండ్ నిషేధమని స్పష్టం చేశారు. సీఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంటీన్ నిర్మించి ఏడాది!

- రూ.5 లక్షల వ్యయంతో ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు
- మహిళా సంఘాలకు అప్పగించాల్సి ఉన్నా నిర్లక్ష్యం
- పట్టించుకోని డీఆర్‌డీఏ, మున్సిపల్ అధికారులు



ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలోని క్యాంటీన్

పాల్వంచ: పాల్వంచలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పట్టణ ప్రజలతో పాటు చుట్టుప్రక్కల ఉన్న మండలాలకు వైద్య సేవలను అందిస్తోంది. ఈ సెంటర్ గిరిజనులకు మరింత చేరువలో ఉండి వారికి అవసరమైన వైద్యం, ప్రసవాలు, నవజాత శిశువుల సంరక్షణ వంటి సేవలతో పాటు వివిధ ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ 300 మందికి పైచిలుకు పేదలు అనేక రోగాలతో వచ్చి వైద్యాన్ని పొందుతుంటారు. అయితే, వీరి సౌకర్యార్థం క్యాంటీన్ నిర్మాణానికి గత ఏడాది శ్రీకారం చుట్టారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న స్థలాన్ని జిల్లా అధికారులు కేటాయించడంతో డీఆర్‌డీఏ నిధులు రూ.5 లక్షలతో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. కిచెన్, హాల్‌తో కూడిన పెద్ద షెడ్డు నిర్మాణంతో పాటు ప్రత్యేక దారిని వేశారు. అన్ని సౌకర్యాలతో ఈ క్యాంటీన్ నిర్మాణమైంది. ఆస్పత్రికి రోగులు, వారితో వచ్చే ప్రజలకు అవసరమైన పాలు, టీ, టిఫిన్, బిస్కెట్, బ్రెడ్, భోజనం వంటి తినుబండారాలు అక్కడ అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

మహిళా సంఘాలకు అప్పగించని అధికారులు

మహిళా శక్తి క్యాంటీన్‌గా దీనిని డీఆర్‌డీఏ అధికారులు నిర్మించారు. అయితే మణుగూరు, అశ్వారావుపేటల్లో ఇదే పద్ధతిలో ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మాణాలు పూర్తి చేసి అక్కడ ప్రారంభం కూడా చేసి నడుపుతున్నారు. అయితే, పాల్వంచ ఆస్పత్రిలో నిర్మించి, ఏడాది దాటినా ఇంకా దానిని ప్రారంభించేందుకు మీనమేషాలు వేస్తున్నారు. అటు డీఆర్‌డీఏ, ఇటు మున్సిపల్, వైద్య, విధాన పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. అయితే దీనిని మహిళా సంఘాలకు అప్పగించాల్సి ఉంది. కానీ, దీని నిర్మాణం పూర్తి చేసిన డీఆర్‌డీఏ.. ఇంకా మున్సిపల్, వైద్య, విధాన పరిషత్ అధికారులకు అప్పగించలేదని అధికారులు చెబుతున్నారు.

అధ్వానంగా పరిసరాలు

ఏడాది దాటుతున్నా క్యాంటీన్ ప్రారంభించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. క్యాంటీన్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. షెడ్డు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. క్యాంటీన్ లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు సైతం చిన్న చిన్న అవసరాలకు బయటకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వైద్యం పొందే వారికి పట్టణంపై అవగాహన లేక ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. అదే క్యాంటీన్ ఆస్పత్రి లోపలే ఉంటే వెంటనే వారికి అవసరమైన తిను బండారాలు తెచ్చుకునే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కాగా దీనిని మహిళా సంఘాలకు అప్పగిస్తే వారు సైతం ఆర్థికంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన ప్రాంగణం

స్థలం కేటాయించాం



క్యాంటీన్ నిర్మాణాల కోసం జిల్లాలోని మణుగూరు, అశ్వారావుపేట, పాల్వంచల్లో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణాల్లో స్థలాలను కేటాయించాం. మణుగూరు, అశ్వారావుపేటల్లో ప్రారంభించారు. కానీ, పాల్వంచలో మాత్రం ఇంకా మాకు అప్పగించలేదు. పనులు పూర్తి అయి ఏడాది దాటుతోంది.

–డాక్టర్ రవిబాబు, డీసీహెచ్ఎస్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



మహిళా క్యాంటీన్‌ను అప్పగించాలని గతంలో డీఆర్‌డీఏ అధికారులను కోరాం. మరోసారి మాట్లాడి తప్పక ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. మహిళా శక్తి క్యాంటీన్ అనే పేరు పెట్టారు కాబట్టి దీనిని మహిళా సంఘాలకు అప్పగించాల్సి ఉంది.

–కె.సుజాత, కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ

అద్దె వాహన డ్రైవర్ల సమ్మె



టేకులపల్లి: ధర్నా చేస్తున్న అద్దె వాహన డ్రైవర్లు



ఇల్లెందు: ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

టేకులపల్లి: టేకులపల్లి కేటీసీఓలో సింగరేణి అద్దె వాహన డ్రైవర్ల సీఎంపీఎఫ్ లెక్కలు చెప్పాలని మోటార్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం కేటీసీలో యూనియన్ ఆధ్వర్యంలో అద్దె వాహనాల డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మె ప్రారంభించారు. పీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్టు డ్రైవర్ల ఖాతాల్లో సీఎంపీఎఫ్ నగదు జమ చేయలేదని, డ్రైవర్లకు అనుమానాలు వస్తున్నాయన్నారు. వెంటనే డ్రైవర్ల ప్రతీ నెల జీతం నుంచి కట్ చేసిన డబ్బులు సీఎంపీఎఫ్ ఖాతాలో జమ చేసేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం సింగరేణి అధికారులతో చర్చలు జరిపారు. డిసెంబర్ 31లోపు వారి సీఎంపీఎఫ్ ఖాతాలో నగదు జమ చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వెంకన్న, రమేశ్, ధ్రువకుమార్, సాయి, నాగేశ్వరరావు, భిక్షం, నారాయణ, కృష్ణ, వేణు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పనిచేస్తున్న అద్దె వాహన డ్రైవర్లు విధులు బహిష్కరించి జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇల్లెందు ఏరియాలో 80 మంది డ్రైవర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని, టీయూసీఐ నాయకులు యాకుబ్ షావలి, పాయం వెంకన్న తెలిపారు. ప్రతీ నెల జీతంలో కట్ చేసిన డబ్బులు సీఎంపీఎఫ్‌లో జమ కావటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సతీశ్, శ్రీను, రఘు, రాజేశ్, వెంకన్న, గోపి, ఊట్ల రాజేశ్, శివ, మహేశ్, వెంకట్, ప్రసాద్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

చుంచుపల్లి: గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారికి ఆశ్రయం ఇవ్వొద్దని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డలో పోలీసులు కార్డన్ సెర్చ్‌లో భాగంగా 250 ఇళ్లలో సుమారు 100 మంది పోలీసులు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 8 ఆటోలు, 100 బైకులను గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యం బాటిళ్లు, సిలిండర్లను స్వాధీనం చేసుకొని, ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని, విపత్కర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని చెప్పారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తత అవసరమని, నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గంజాయి రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు రాయల వెంకటేశ్వర్లు, శివప్రసాద్, కరుణాకర్, ఎస్ఐలు రమణారెడ్డి, రవి, విజయలక్ష్మి, రమాదేవి, మనీషా, చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జీతాలు తగ్గించే జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 11 రోజులుగా సమ్మె చేస్తున్న గిరిజన హాస్టల్ వర్కర్లు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని స్వచ్ఛమిత్ర కార్మికులు.. ఐదు నెలలుగా రావాల్సిన వేతన బకాయిలు ఇవ్వాలని బీసీ గురుకుల పాఠశాలల్లో వంటపని చేస్తున్న కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్, కుంజా నరసింహారావు, సేవ్యా, జి.పద్మ, కె.సత్య, భద్రయ్య, వెంకట్రావు, శ్రీరాములు, చందు, రాధ, కుమారి, దుర్గ, మణి, రాణి, వెంకటనర్సమ్మ, అనురాధ, సులోచన, నిహారిక, పద్మ, నీల, సమ్మక్క, లక్ష్మి, శిరీష, కుసుమ, రమణ, పద్మ, పార్వతమ్మ, రజిని, ఉషారాణి, రమేశ్, శ్రీరాములు, యువరాజు, ఈశ్వరి, సుశీల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు అనుమతి నిరాకరణ

ఇల్లెందు: శాంతియుతంగా ఆందోళన చేసేందుకు డైలీవేజ్ వర్కర్లకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో పట్టణంలోని గోవింద్‌సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం, జగదాంబ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం, జేకేలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఏటీడీఓ కార్యాలయం ఎదుట డైలీవేజ్ వర్కర్ల నిరసన తెలిపారు. సోమవారం ఇల్లెందులో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేసే డైలీవేజ్ వర్కర్లు, ఔట్ సోర్సింగ్ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, రామకళ మాట్లాడుతూ.. డైలీవేజ్ వర్కర్లకు చెల్లించే వేతనాలను ప్రభుత్వం భారీగా తగ్గించిందన్నారు. కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తటం లేదని పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



ఎస్డీ యాసిర్ పాషా

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సయ్యద్ యాసిర్ పాషా అండర్–19 విభాగం ఫుట్‌బాల్ క్రీడా జట్టుకు ఎంపికయ్యాడు. జనగాంలో జరిగే జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. సోమవారం ఇల్లెందు కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నీరజ యాసిర్‌పాషాను అభినందించారు.

అరెస్టు సరికాదు..

జూలూరుపాడు: కేజీబీవీ వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలను అధికారులకు చెప్పుకునేందుకు పలు జిల్లాల నుంచి బయలుదేరిన కేజీబీవీ వర్కర్లు, టీయూసీఐ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన తెలిపారు.

పలువురికి ఎంబీబీఎస్ సీట్లు



బాణాల ఉమాశ్రీ



ధరావత్ అంజలి

జూలూరుపాడు: మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు నీట్‌లో ప్రతిభ చూపి, మెడిసిన్ సీట్లు సాధించి సత్తా చాటారు. గుండ్లరేవు గ్రామానికి చెందిన బాణాల పుల్లాచారి కుమార్తె ఉమాశ్రీ, సూరారం గ్రామానికి చెందిన ధరావత్ భీముడు కుమార్తె అంజలి మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందగా, గుండ్లరేవు గ్రామానికి చెందిన బానోత్ రవి కుమార్తె చైతన్యసాయి ఖమ్మం మమత మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్‌లో చేరింది. విద్యార్థులను తల్లిదండ్రులు, గ్రామస్తులు, తోటి స్నేహితులు అభినందించారు.

హామీలు అమలు చేయాలి

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) ఏరియా కార్యదర్శి దుబాకుల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లిలో జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అందించడంతో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ఆటో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆదాయం రాక ఇల్లు గడవని పరిస్థితి ఎదురవుతోందని వెల్లడించారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.12 వేలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సురేశ్, షఫీ, సుధీర్, బాలాజీ, కన్నయ్య, హరిలాల్, చందు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం’

కొత్తగూడెంఅర్బన్: దశాబ్ద కాలానికి పైగా 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని, వారికి గత ఏడాది కంటే రూ.500 బోనస్ పెంచడం దారుణమని పీఎస్‌డబ్ల్యూటీయూసీఐ కొత్తగూడెం రీజియన్ సెక్రెటరీ పెద్దబోయిన సతీశ్ పేర్కొన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో ఉన్న 30 వేల మంది కార్మికులు వారి కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గత సంవత్సరం రూ.5,000 ప్రకటించిన ప్రభుత్వం, కనీసం ఈ ఏడాది రూ.10 వేలు ప్రకటిస్తుందనుకుంటే, రూ.500 మాత్రమే ఎక్కువ ప్రకటించిందని చెప్పారు. సమావేశంలో రీజియన్ అధ్యక్షులు ఎ.శరత్, జాన్ సంజీవరెడ్డి, రమేశ్, షఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దబోయిన సతీశ్

ఓటరు జాబితాపై బీఎల్ఓల కసరత్తు



ఓటరు జాబితా పరిశీలిస్తున్న బీఎల్ఓలు

ఇల్లెందురూరల్: ఓటరు జాబితా రూపకల్పనపై ఎన్నికల సంఘం ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధమవుతోంది. అర్హులైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. దీనికోసం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించి తాజా ప్రక్రియపై అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్‌ల వారీగా తమ పరిధిలోని ఓటరు జాబితా పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో 2002లో మనుగడలో ఉన్న ఓటరు జాబితా, ఓటరు ఐడీ ఆధారంగా ఓటరు వయస్సు ప్రమాణికంగా విభజించే ప్రక్రియను చేపట్టారు. ఇలా సిద్ధం చేసిన ఓటరు జాబితాకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసి డ్యూయల్ ఓటర్లు, మృతులను తొలగిస్తారు. ప్రక్రియను తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

టెన్నిస్‌లో పాల్వంచ క్రీడాకారుల సత్తా

పాల్వంచ: గత 21వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఓపెన్ టెన్నిస్ క్రీడల్లో పాల్వంచ విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్–10, 12, 14 బాల, బాలికల విభాగాల్లో యువన్ సాయి, ప్రీతి ప్రజ్వల, ప్రవస్తి, భానుశ్రీ, హిద్రిత్, జైదీప్, శాన్వి పాల్గొని విజేతలుగా నిలిచారు. వారిని సోమవారం అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కృష్ణారావు, కామపాటి సత్యనారాయణ, రాజశేఖర్, రమేశ్, సుధాకర్, రామ్, దినేశ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

దేవీశరన్నవరాత్రి వేడుకలు షురూ..

కొత్తగూడెంటౌన్: శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు, విగ్రహాలను కొలువుదీర్చిన మండపాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య పూజలు నిర్వహించారు. కొత్తగూడెం శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేశ్ టెంపుల్)లో శ్రీబాలత్రిపురసుందరీగా దర్శనమిచారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మండలంలోని ఉమా సోమలింగేశ్వరాలయం, శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో భక్తులు పూజలు చేశారు. జూలూరుపాడు, సూరారం శ్రీసీతారామాలయాల్లో, వెంగన్నపాలెం, గుండెపుడి, అనంతారం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాల్లోనూ, వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీ, కాకర్ల, కొమ్ముగూడెం పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి ప్రాంగణంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించగా.. సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు కోలాటం ఆడారు.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్/ఇల్లెందు: ఇల్లెందు పట్టణంతోపాటు సుభాష్‌నగర్, ఇందిరానగర్, కొమరారం, పోలారం గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు అమ్మవారి మాల ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: పాల్వంచలోని పలు ప్రాంతాలు, కేటీపీఎస్‌లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఎస్ఈలు పి.కృష్ణ, బి.శివరాంరెడ్డి, జీవీ ధర్మారావు, బి.మోక్షవీర్, డీవైసీసీఏ పి.రామారావు, అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, ఆర్ఐ కిరణ్ పాల్గొని పూజలు నిర్వహించారు.



కొత్తగూడెంటౌన్: బాలాత్రిపురసుందరి దేవిగా..



జూలూరుపాడు: కాకర్లలో పూజలు చేస్తున్న భక్తులు



సుజాతనగర్: పూజలు చేస్తున్న భక్తులు



ఇల్లెందు: నంబర్–2 బస్తీ రామాలయంలో..



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో..



పాల్వంచ: పూజలు చేస్తున్న ఎస్ఈ దంపతులు

టేకులపల్లిలో..

టేకులపల్లి: టేకులపల్లి రామాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, బస్టాండ్ సెంటర్, కోయగూడెం, బోడు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోయగూడెంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గోలియాతండాలో లక్కినేని సురేందర్‌రావు, ఇస్లావత్ నామానాయక్, పూన్యా తదితరులు పూజలు చేశారు.



టేకులపల్లి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు